రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - వి.మాడుగుల: ఆగస్టు 15న జరిగే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కోరారు. గురువారం ఉదయం మాడుగులకు చెందిన భారత నిర్మాణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆగస్టు 15న జరిగే రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని ఈనాటి యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాడుగుల టీడీపీ పట్టణ అధ్యక్షులు వద్దాది రంజిత్ వర్మ, మండల కార్యదర్శి లెక్కల కాశిబాబు, పి.సూర్యనారాయణవర్మ, జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి రొబ్బా మహేష్, భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణా గోదావరి నదీ జలాల పున: పంపిణీ ద్వారా

రాష్ట్ర నీటి హక్కులను కాపాడుకోవాలి

విశాలాంధ్ర - చోడవరం: కృష్ణా, గోదావరి నదీ జలాలు పునః పంపిణీ ద్వారా ఏ.పి. రాష్ట్ర నీటి హక్కులను కాపాడుకోవాలని అనకాపల్లి జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నందు కృష్ణా నది జలాలు పంపిణీ ద్వారా మన రాష్ట్ర నీటి హక్కుల్ని కాపాడ వలసిన సమయం ఆసన్నమైందని తెలియజేసారు. ఆగస్టు రెండోవారం లోపు ప్రభుత్వంతో కూడిన వాదనలతో కూడిన బ్రిజేష్ కుమార్ నివేదికను ఇవ్వాలని కోరారు. ఇప్పటికే రెండు మూడు పర్యాయాలు గత ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదని, ఏపీకి కృష్ణా, గోదావరి నదులకు చివర రాష్ట్రమైనందున అటు వరదల వలన వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు రైతాంగం నష్టపోయే పరిస్థితులు వున్నాయని తెలియజేసారు. దాపురిస్తున్న ప్రకృతి వైపరీత్యాలతో రాష్ట్ర రైతాంగాన్ని గమనించి తగిన పరిహారాన్ని అందజేయడానికి ట్రిబ్యునల్ పోరాడవలసి ఉందన్నారు. గోదావరి నదీ నీటి పంపిణీ విషయం చర్చించేందుకు ఉభయ రాష్ట్రాలు మధ్య ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని పై అంశాలు చర్చించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు సాగునీటి రంగ నిపుణులతో సమావేశం నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ ద్వారా తమ వినతులను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి చేరవేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో కమ్యూనిస్టు నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మద్రి బాబు, ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, రైతు సంఘం కార్యవర్గ సభ్యులు గురుబాబు, కొర్పిలి శంకర్రావు, పప్పల ఈశ్వరరావు, లక్ష్మీ, రైతు సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ నందు హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన జి.శ్రీనివాసరావు మే 17న గుండెపోటు వచ్చి చనిపోయారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూ.3,83,400/- చెక్‌ను తన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎం.దీపిక అందజేశారు. మృతి చెందిన హోంగార్డ్ భార్య తులసి రామలక్ష్మికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ నందు ప్రశంసా పూర్వకమైన విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకు మెరుగైన సేవలు అందించారని ప్రశం సించారు. ఈ సందర్భంగా మరణించిన హోంగార్డు శ్రీనివాసరావును సేవలను ప్రత్యేకంగా గుర్తు చేసుకొని ఆయన భార్య తులసి రామలక్ష్మిని ఓదార్చి భరోసా కల్పించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డు ఎవరైనా విధి నిర్వహణలో మరణించినా లేదా పదవీ విరమణ పొందినా వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలలో పనిచేస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను ఆర్థిక సహాయంగా అందజేస్తారన్నారు. ఈ కార్య క్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, ఏఓ బి.శారద, సూపరింటెండెంట్ వరలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ వంశీ పాల్గొన్నారు.

దూరవిద్య ద్వారా టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు

విశాలాంధ్ర - కె.కోటపాడు: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (దూర విద్యా విధానం) ద్వారా టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సులకు 2024-25 విద్యా సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభ మయ్యాయని ఏపీ సార్వత్రిక విద్యా పీఠం స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్, అయ్యన్న జూనియర్ కాలేజీ స్టడీ సెంటర్ల కో-ఆర్డినేటర్ డాక్టరు ఖాశీం తెలిపారు. 14 సంవత్సరాల వయస్సు, చదవటం, వ్రాయటం పరిజ్ఞానం కలవారు, పదవ తరగతి పరీక్షలు ఫెయిల్ అయిన వారు, చదువుతూ మధ్యలో మానేసిన వారు టెన్త్ క్లాస్ కోర్సులో చేరేందుకు అర్హులని చెప్పారు. 15 ఏళ్ల నిండి పదవ తరగతి పూర్తయిన వారు, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన వారు, చదువుతూ మధ్యలో మానేసిన వారు ఇంటర్మీడియట్ కోర్సులో చేరి ఐదు సబ్జెక్టులతో సింగిల్ సిట్టింగ్ విధానం ద్వారా కోర్సు పూర్తి చేయవచ్చని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోగా టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సులలో చేరవచ్చునని వివరాల కోసం స్టడీ సెంటర్ల పనివేళల్లో నేరుగా సంప్రదించవచ్చునని అయ్యన్న కాలేజీ స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఖాశీం తెలిపారు.

తహశీల్దార్‌గా మహేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - రావికమతం: మండల నూతన తహశీల్దార్‌గా ఎస్‌వి మహేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల బదిలీలలో భాగంగా ఇక్కడ పనిచేస్తూ శ్రీకాకుళం బదిలీపై వెళ్లారు. ఎన్నికలు ముగియడంతో తిరిగి మహేశ్వరావునే ఎమ్మార్వోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సంబంధిత సమస్యలు పరిష్కారానికి సిబ్బంది సహకారం అందించాలని కోరారు.

వాయిదా పడ్డ పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు

విశాలాంధ్ర - రావికమతం: గురువారం జరగాల్సిన పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ఆగస్టు 17న నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి తలుపులు తెలిపారు. ముందుగా జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం గురువారం ఎన్నిక జరగాల్సి ఉందన్నారు. అయితే వీటిని వాయిదా వేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. తిరిగి ఈ ఎన్నికలను 17న నిర్వహించాలని తెలిపారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను మండలంలో 71 పాఠశాలలో ప్రదర్శించామని చెప్పారు. ఈనెల 12న ఈ జాబితా అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు.

నాన్ షెడ్యూల్ ఆదివాసీ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: నాన్ షెడ్యూల్ ఆదివాసీ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలంటూ మాడుగుల పంచాయతీలో గదబురు గ్రామంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి మాట్లాడుతూ నాన్ షెడ్యూల్ ఆదివాసి గిరిజన గ్రామాలను ఐదోవ షెడ్యూల్లో చేర్చడమే నిజమైన ఆదివాసీ దినోత్సవమని అన్నారు. కూటమి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 320 ఆదివాసి గిరిజన గ్రామాలను ఆదివాసీ షెడ్యూల్ ప్రాంతంలో కలపాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ఏరియాలో కలపనందున ఇక్కడ నివసిస్తున్న ఆదివాసీల భూములు, అడవులకు రక్షణ లేదన్నారు. గిరిజనేతర పెత్తందారులు మైనింగ్ మాఫియా మధ్య ఆదివాసీలు నలిగిపోతున్నారని తెలిపారు. ఐటీడీఏ అభివృద్ధి ఫలాలు అందక ఆదివాసి గ్రామాలు విద్య వైద్యం, ఉపాధి, మంచినీరు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో లేక బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలపై దాడులు జరుగుతున్నాయని వాటిని ఎప్పటికప్పుడు తిప్పికొట్టేందుకు ఆదివాసీలు ఐక్యం కావలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టోకురు చిలకమ్మ, ఓంద్రు కొండమ్మ, పిల్లి ఎర్రయ్యమ్మ గిరిజనులు పాల్గొన్నారు.

మర్ల గుమ్మి ఛానల్‌ను పరిశీలించిన బండారు

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని ఎల్ఎన్ పురం ఛానల్, జైతవరం గ్రామంలో డోకల వారి కల్లాల వద్ద గల మర్లగుమ్మి ఛానల్‌లను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్లగూమ్మి ఛానల్‌లో గతంలో మట్టి కూరుకుపోయి ఉండటం వలన సాగునీరు అందక రైతులు నానా ఇబ్బందులు పడ్డారని, వాటి మరమ్మతులు త్వరతిగతిన పూర్తిచేసి మూడు రోజులలో పూర్తి స్థాయిలో పొలాలకు సకాలంలో సాగునీటిని అందిస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని డ్యాంల మరమ్మతులు చేయించి పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు చేపడతా మన్నారు. గత ప్రభుత్వం రైతులను విస్మరించిందన్నారు. అధికారులు బాగా పనిచేస్తే ప్రోత్సహిస్తామని పని చేయని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గండి ముసలినాయుడు, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, పేరపు కొండబాబు, రెడ్డి రాము సూరినాయుడు, ఇరిగేషన్ డిఈ వేణుగోపాల్ నాయుడు, జేఈ జయరాం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ ఏ.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వేంపాడు టోల్ ప్లాజా వద్ద వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా వాహనదారుల రికార్డులను పరిశీలించి వాహనాల్లో గంజాయి అక్రమ రవాణా, నిషేధిత వస్తువులు రవాణాపై స్నిఫర్ డాగ్ సహకారంతో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భారీ వాహనాలతో పాటు బస్సుల్లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ సన్నీబాబు తదితరులు పాల్గొన్నారు.

హేచరీల్లో పాత ఏజెంట్లనే కొనసాగించాలి

- జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాయకరావుపేట మండలంలోని హేచరీల్లో రొయ్య పిల్లల ప్యాకింగ్‌కు పాత ఏజెంట్లను కొనసాగించాలని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలోని పాల్మాన్ పేట గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ పాల్మాన్ పేట పంచాయతీ పరిధిలో 21 హేచరీలు ఉన్నాయని తెలిపారు. వీటిలో గతంలో స్థానికేతరులను నియమించారని అయితే స్థానికులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశ్యంతో నియమించిన స్థానికేతరులను తొలగించి ఆయా ప్రాంతాల్లో వారికి ఉపాధి కల్పించారని అన్నారు. తరువాత హేచరీల్లో స్థానికులను ఏజెంట్లుగా నియమించారని, కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏజెంట్లను తొలగించి ఆ పార్టీ నాయకులు తమ పార్టీకి చెందిన వారిని ఏజెంట్లుగా నియమించాలని హేచరీ యాజమాన్యాన్ని బెదిరిస్తున్నారని తెలిపారు. అంతేకాక మత్స్యకారుల మధ్య అంతర్గత విభేదాలు సృష్టిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి పరిష్కారం లభించలేదని తెలిపారు. హేచరీలపై ఆధారపడి జీవిస్తున్న వారంతా ఉపాధి కోల్పోయారని తెలిపారు. హేచరీల్లో పాత ఏజెంట్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. స్థానికులకు జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, రాష్ట్ర మానవ హక్కుల సంఘం, జాతీయ మానవ హక్కుల సంఘం, కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని మోసా అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో చొక్కా సతీష్, మైలపల్లి శివ, గరికిన కుమార్, మోసా శ్రీను, కోడా గాలి రాజు, వంక ధన బాబు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తోట నగేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, జనసేన నాయకులు తోట నగేష్ జన్మదిన వేడుకలు పాయకరావుపేటలో ఆయన నివాసం వద్ద ఘనంగా జరుపుకున్నారు. నాయకులు, అభిమానులు సమక్షంలో తోట నగేష్ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీనివాస రావు, యాళ్ల వరహాల బాబు, యాళ్ల సురేష్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివ దత్, కొయ్య ప్రసాద్ రెడ్డి తదితరులు స్వయంగా వచ్చి తోట నగేష్‌కు శాలువా, పుష్ప గుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నగేష్ జన్మదినాన్ని పురస్క రించుకొని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అలాగే పేదలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెదపాటి మేఘరంజన్, ఇంజరపు సూరిబాబు, ఐఎన్ మూర్తి, కువల కుమార్, పెంకె శ్రీను, ముక్కుడుపల్లి నాగరాజు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఆగస్టు 15న స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ఆ మేరకు పటిష్ట ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పిల్లల్లో దేశభక్తిని పెంపొందించేలా వేడుకలను నిర్వహించాలని, సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టాలని చెప్పారు. సాంస్కృతిక ప్రదర్శనలు, స్టాల్స్ ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపట్టే ఒదుకు, ఆ మేరకు ఆయా విభాగాల పరిధిలో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచిం చారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలన్నారు. అనకాపల్లి స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆగస్టు 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జరిగే స్వాతంత్ర్య వేడుకలకు జిల్లా ప్రజలు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులు, ఇతర ప్రముఖులతో పాటు అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. స్టేజ్ అలంకరణ, సీటింగ్ ఏర్పాటు, స్టాల్స్ ఏర్పాటు, సౌండ్ సిస్టం, మైదానంలో అవసరమైన మేరకు పనులు చేపట్టే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పైలెట్ వాహనం ఫిట్ నెస్ చెక్ చేసుకోవాలన్నారు. ముందుగానే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వేడుకల రోజు అందరికీ సరిపడా తాగునీరు సమకూర్చాలని చెప్పారు. పోలీసు, ఎన్.సి.సి. విభాగాల వారు గార్డ్ ఆఫ్ ఆనర్, పరేడ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించి, సమన్వయం చేసుకోవాలని సూచించారు. వేడుకులకు వచ్చే అతిథులకు, సామాన్య ప్రజలకు, విద్యార్థులకు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు సరిచూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అధికారులందరూ సాంప్రదాయ చేనేత వస్త్రాలు ధరించి స్వతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఎడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విజయభాస్కర్, ఇన్చార్జి డీఆర్వో వై.శ్రీనివాసరావు, అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ పాల్గొన్నారు.

పెన్షన్ మంజూరు చేయరూ....!

దివ్యాంగురాలు వేడుకోలు



విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: బుచ్చయ్యపేట మండలం ఆర్.శివరాంపురం గ్రామ సచివాలయం అప్పం పాలెం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు వెచ్చం రమణమ్మ పెన్షన్ కోసం ఎదురు చూస్తోంది. 80 శాతం అంగవైకల్యం ఉన్న దివ్యాంగులకు గత ప్రభుత్వం ప్రతినెల ఐదువేల రూపాయలు పెన్షన్ మంజూరు చేసేది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఐదువేల రూపాయల పెన్షన్‌ను 15 వేల రూపాయలు చేయడం జరిగింది. 80 శాతం అంగవైకల్యం ఉంటే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇచ్చిన సిఫార్సు లేఖలను పరిగణలోకి తీసుకొని పెన్షన్‌కి అర్హులను చేసే వారిని అయితే గత ప్రభుత్వంలో ఆన్లైన్లో అప్లై చేసుకుని పెన్షన్ అందక సుమారు 250 మంది దివ్యాంగులు ఉండిపోయారు. అధికారులకు ఎన్ని దఫాలుగా విన్నవించుకున్నా ఫలితం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

పట్టు పాలు వద్దు, తల్లి పాలే ముద్దు

విశాలాంధ్ర - చోడవరం: పోత, పట్టు పాలు కంటే తల్లి పాలే పిల్లలకు ముద్దు అని రావికమతం సమగ్ర శిశు సంరక్షణ అభివృద్ధి పథకం (ఐ.సి.డి.ఎస్.) పరిధిలోని అంగన్వాడీ సూపర్వైజర్‌లు తెలియజేసారు. తల్లి పాలు వారోత్సవాల్లో భాగంగా రావికమతం అంగన్వాడీ ప్రాజెక్టు పరిధిలో గల 78 అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్‌లు, గర్భిణీలు, బాలింతలతో చోడవరం జెడ్.పి. గర్ల్స్ హై స్కూలులో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టగానే మురిసిపోయే తల్లి, గంటలోగా తన పాలు బిడ్డకు ఇవ్వాలని, వీటినే ముర్రు పాలు అంటారని తెలిపారు. తల్లి ముర్రు పాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది అన్నారు. ఇదే మొదటి టీకాగా ఉపయోగపడుతుందని తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్‌లు ఏ.అనిత, డి.శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఏఎస్ఐ మృతి

విశాలాంధ్ర - కే.కోటపాడు: స్థానిక కె.కోటపాడు పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఏఎస్ఐగా పదోన్నతిపై సబ్బవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లిన గొర్లె రామునాయుడు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన సొంత గ్రామం కె.కోటపాడు మండలం కేజే పురం. ఇక్కడే భార్యా పిల్లలు ఉంటున్నారు. జిల్లా ఎస్పీ దీపిక ఆదేశాల ప్రకారం గురువారం ఏఆర్ పోలీసులచే గౌరవ వందనంతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

పీఏసీఎస్‌లో ఆన్‌లైన్ విధానానికి సహకరించండి

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలోని పలు పీఏసీఎస్‌లలో సభ్యత్వం ఉన్న రైతుల వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేసేందుకు కంప్యూటరీకరణ దృష్ట్యా సన్నాహాలు చేస్తున్నామని ఈ మేరకు సభ్య రైతులు సహకరించాలని తురకలపూడి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, పాన్ కార్డ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో వివరాలను అందజేయాలని కోరారు.

జన సైనికులకు అభినందన

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: చోడవరం నియోజకవర్గం బుచ్చయ్యపేట మండలంలోని జనసైనికులు మండల పార్టీ అధ్యక్షులు డిఎస్ నాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్ రాజును పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఇటీవల జనసేన పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో ప్రతి గ్రామంలోనూ చురుకుగా పాల్గొని రికార్డు స్థాయిలో సభ్యత్వాలు నమోదు చేయించిన జన సైనికులను అభినందించారు. జనసేన పార్టీ అభివృద్ధికి కృషిచేసిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తిస్తుందని రాబోయే రోజులలో నామినేటెడ్ పదవులు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎడ్ల రామ్మూర్తి, యూత్ అధ్యక్షుడు షేక్ రసూల్, వడ్డాది టౌన్ ప్రెసిడెంట్ దొండా సాయి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు వెంకన్న చిత్రపటం బహూకరణ

విశాలాంధ్ర - నక్కపల్లి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వైసీపీ రాష్ట్ర నాయకులు వీసం రామకృష్ణ తాడేపల్లిలో గురువారం కలిసి వెంకన్న చిత్రపటాన్ని బహూకరించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ ఆధ్వర్యంలో ఎంపిటిసి సభ్యులు బచ్చల రాజుతో కలిసి శ్రీ ఉపమాక వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణకు జగన్మోహన్ రెడ్డి అభినందనలు తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఎప్పుడూ ఉంటదని రామకృష్ణతో జగన్ అన్నారు.

మంత్రి కొల్లును కలిసిన టీడీపీ యువత నేత బొడ్డేడ ప్రసాద్

విశాలాంధ్ర -మునగపాక: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను విజయవాడ సచివాలయంలో యలమంచిలి నియోజవర్గం మునగ పాక మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా యలమంచిలి నియోజకవర్గ పరిధిలో గల పలు అంశాలను మంత్రికి వివరించారు. అలాగే ప్రసాద్ జన్మదినం సందర్భంగా మంత్రి రవీంద్ర ప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

స్థాపితం : 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
అనకాపల్లి జిల్లాలో ఈ కింది కేంద్రాల్లో పని చేయుటకు కనీస విద్యార్హత ఇంటర్, ఆపైన చదివి జర్నలిజం పట్ల ఆసక్తి కలిగి తెలుగు భాషలో స్పష్టంగా రాయడం, చదవడం వచ్చి ఉండాలి.
తేది: 18-8-2024వ తేదీన ఉదయం 10 నుంచి 11 గంటల వరకు అనకాపల్లి విశాలాంధ్ర కార్యాలయంలో అర్హత రాత పరీక్ష నిర్వహించబడును. ఆసక్తి ఉన్న వారు 18వ తేదీ ఉదయం 9.30 గంటల్లోగా వాట్సాప్‌లో గాని నేరుగా గాని తమ పేర్లు నమోదు చేసుకోగలరు. అదేరోజు మధ్యాహ్నం 2 గం.ల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించబడును.
ఖాళీలు: అనకాపల్లి టౌన్, అనకాపల్లి కలెక్టరేట్, చోడవరం రూరల్, రోలుగుంట, బుచ్చయ్యపేట, నర్సీపట్నం రూరల్, నాతవరం, సబ్బవరం కేంద్రాల్లో పని చేయాలి.
సంప్రదించాల్సిన చిరునామా:
కొండలరావు, విశాలాంధ్ర బ్యూరో చీఫ్
విశాలాంధ్ర కార్యాలయం, దుర్గా లాడ్జి వీధి, నర్సింగరావుపేట, రామచంద్ర థియేటర్ వెనుక, అనకాపల్లి.
సెల్: 9291900805, 9573385159.